
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ׀ 9 ׀ సెప్టెంబర్ ׀ 2023



సోమశిలలో 21.780టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం నాటికి 21.780 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 12,880 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,496
3శాతం జీఎస్టీతో	రూ.5,661
సవర (8గ్రా)	రూ.45,288

గరిష్టం/కనిష్టం
37.2 /27.5

వాతావరణం

వాతావరణంలో తేమ 45 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా శనివారం కొన్ని మండలాల్లో చిరుజల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం



అర్జీలను పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు సిబ్బంది శుక్రవారం నిర్వహించిన కవాతును ఎస్పీ పరిశీలించి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోలీసు సంక్షేమ దివాస్‌ను నిర్వహించారు. అనారోగ్యం, బదిలీలు, ఈఎల్‌ఎఫ్, డిజర్వస్, కోఆపరేటివ్, భద్రత లోన్లు, తదితర సమస్యలను సిబ్బంది అర్జీల రూపంలో ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన ఆయన రోజుల వ్యవధిలోనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఏఎస్పీలు హిమవతి, శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

నెల్లూరు (లీగల్): కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సీ యామిని తెలిపారు. నగరంలోని జిల్లా కోర్టు హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. లోక్‌అదాలత్‌లో రాజీకి వీలైన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాలు, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు, విద్యుత్, తదితర కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖ ద్వారా సుమారు 15వేల కేసులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏసీబీ స్పెషల్ కోర్టు జడ్జి సీ సత్యవాణి, ఏఎస్పీ హిమవతి, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పాల్గొన్నారు.

తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా చిన్నఓబులేసు



జేసీ కూర్మనాథ్‌ను కలిసిన స్పెషల్ కలెక్టర్ చిన్నఓబులేసు

నెల్లూరు(దర్గామిట్ట): తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా బీ చిన్నఓబులేసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఇప్పటి వరకు తెలుగుగంగ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జీజీహెచ్‌లో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న నరేంద్ర

నెల్లూరు(సెంట్రల్): జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ నరేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వివిధ విభాగాలకు సంబంధించి పది మంది అనుభవజ్ఞులైన వైద్యులను నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. త్వరలోనే వారు బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. కార్డియాలజీ, కార్డియోథోరాసిక్ సర్జరీ విభాగాలకు డీఎంఈ నుంచి అనుమతులు వచ్చాయని చెప్పారు. వాటికి సంబంధించి త్వరలోనే వైద్యులను నియమించనున్నట్లు వెల్లడించారు. నూతనంగా న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, త్వరలోనే వాటిని ప్రవేశపెట్టనున్నారని తెలిపారు.

కంటి వెలుగులు



సర్వేంద్రియానాం నయనం ప్రధానం.. శరీరంలోని అంగాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవి. కంటి చూపు కోల్పోతే జీవితం అంధకారమవుతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కంటి వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు, మందులు పంపిణీ చేస్తోంది. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా చేయిస్తూ వెలుగులను ప్రసాదిస్తోంది.

వైఎస్సార్ కంటి వెలుగుకు అపూర్వ ఆదరణ

- ఉమ్మడి జిల్లాలో 64వేల మందికి కంటి పరీక్షలు
- 4,888 మందికి శస్త్రచికిత్సలు
- 55వేల మందికిపైగా కళ్ల అద్దాల పంపిణీ

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటి వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా కంటి వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో 2019లో వైఎస్సార్ కంటి వెలుగు పథకానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తొలి ఐదు నెలల్లో ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో కరోనా మహమ్మారి రాష్ట్రాన్ని చుట్టుముట్టడంతో ఏడాది పాటు కంటి వైద్యపరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. 2022వ సంవత్సరం తొలి త్రైమాసికంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా మొదటి దశలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆత్మకూరు, నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రుల్లో నిర్వహించారు. రెండో దశలో అవ్వా, తాతలకు కంటి వెలుగులు ప్రసాదించాలని సంకల్పించిన ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రుల్లో ప్రతి సోమవారం కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు పంపిణీ చేస్తోంది. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి మంగళ, గురు, శుక్రవారాల్లో ఉచితంగా చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో...

వైఎస్సార్ కంటి వెలుగు రెండు విడతల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కంటి సమస్యలతో బాధపడుతున్న 64వేల మందిని గుర్తించి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 55వేల మందికి కళ్ల అద్దాలు, మందులు పంపిణీ చేశారు. 2021 జూన్ నుంచి 2023 మే 31 వరకు 4,888 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేశారు. అందులో అత్యధికంగా ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ శార్వాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రుల్లో కంటి శస్త్రచికిత్సలు చేయించుకునే వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.1540 జమ చేస్తోంది. దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో కంటి శస్త్రచికిత్సలకు ఆదరణ లభిస్తోంది. నెల్లూరు జీజీహెచ్‌తో పాటు ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి, కావలి, గూడూరు ఆస్పత్రుల్లో నిరంతరం కంటి వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో వెలుగులను ప్రసాదిస్తోంది.



కంటి ఆపరేషన్‌కు ముందు చికిత్స అందిస్తున్న కంటి వైద్యుడు

ఉచితంగా కంటి వైద్యసేవలు

కంటి వైద్యపరీక్షలు, కళ్ల అద్దాలు, శస్త్రచికిత్సలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చవుతుంది. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలకు ప్యాకేజీలు ప్రకటించి రూ.15వేల నుంచి రూ.75వేల వరకు ఆయా చికిత్సల ఆధారంగా వసూలు చేస్తున్నారు. ఇంత ఖరీదైన కంటి వైద్యం, శస్త్రచికిత్సలను ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందిస్తోంది.

కంటి పరీక్షలు ఇలా..

కంటి సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన వారికి మూడు దశల్లో చికిత్స అందిస్తున్నారు. తొలుత ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారు. కొద్దిరోజుల తరువాత కంటిచూపు మెరుగుపడితే సరి లేకుంటే శస్త్రచికిత్స చేస్తారు. కంటి శస్త్రచికిత్సకు ముందు ఆస్పత్రికి వచ్చిన రోగికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుంటారు. ఆ మరుసటి రోజు (మంగళ, గురు, శుక్రవారాలు) శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఆపరేషన్‌కు ముందు ఆప్తమాలజిస్ట్ రోగులకు ముందస్తు చికిత్సలు నిర్వహిస్తారు. అనంతరం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి శస్త్రచికిత్సలు చేస్తారు. అనంతరం ఒక రోజు ఆస్పత్రిలో ఉంచుకుని పరిశీలించి ఇంటికి పంపుతున్నట్లు వైద్యులు తెలిపారు.



ప్రభుత్వాస్పత్రిలో కంటి శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

ఏడాదిలో నిర్వహించిన కంటి శస్త్రచికిత్సలు

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్) 1800	ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి 1809
కావలి ఏరియా ఆస్పత్రి 58	గూడూరు ఏరియా ఆస్పత్రి 1221

"కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



వైఎస్సార్ కంటి వెలుగు కింద గూడూరు, నెల్లూరు, ఆత్మకూరు, కావలి ప్రభుత్వాస్పత్రుల్లో ఇప్పటి వరకు 4,888 మందికి కంటి శస్త్రచికిత్సలు (కాటరాక్ట్) నిర్వహించాం.ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాల మేరకు కంటి చికిత్సలు ఉచితంగా చేస్తున్నాం. ఎక్కువ మందికి కంటి వెలుగు ప్రసాదించే అవకాశం ప్రభుత్వం కల్పిస్తున్నందున అవసరమైన వారందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ శార్వాణి, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం అధికారిణి

చంద్రబాబు పర్యటనతోనే వర్షాభావం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా
- పిడతాపోలూరులో వైఎస్సార్‌సీపీలో 200 మంది చేరిక

ముత్తుకూరు: రాష్ట్రంలో నాలుగేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సమృద్ధిగా వర్షాలు కురిశాయని, ఈ ఏడాది చంద్రబాబు రాష్ట్రంలో పర్యటిస్తుండడంతో వర్షాలు మొహం చాటేశాయని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పిడతాపోలూరులో రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరగా మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. చంద్రబాబు పాదం మోపితే దుర్భిక్షం ఏర్పడుతుందని, కరువు విలయతాండవమాడుతుందని ఎద్దేవా చేశారు.

ధాన్యానికి మంచి ధరలు

ప్రస్తుతం 1010 రకం, కేఎస్‌ఎం రకం వరి ధాన్యానికి మంచి ధరలు లభిస్తున్నాయని మంత్రి కాకాణి తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి మిల్లర్లు, వ్యాపారులకు అండగా నిలవడంతో ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించలేదన్నారు. ప్రస్తుతం రైతులకు అండగా నిలుస్తూ వ్యాపారులు, మిల్లర్లను హెచ్చరిస్తుండడంతో గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయన్నారు. సోమిరెడ్డి మౌనంగా ఉంటేనే రైతులకు మంచి ధరలు లభిస్తాయన్నారు. అందుకే సోమిరెడ్డితో వేగలేని వాళ్లంతా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. స్థానిక నాయకుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి కోరిన రెండు పనులు అధికారులతో మాట్లాడి పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, వైస్‌ఎంపీపీ పోలిరెడ్డి చిన్నపరెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్దన్ రెడ్డి, సర్పంచ్ రాజకుమారి, కొడవలూరు చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

అయ్యో.. చంద్రశేఖరా!

- చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- ఉదయగిరి టికెట్ కోసం విజ్ఞప్తి
- చూద్దాంలే అంటూ దాటేసిన బాబు
- ఉదయగిరి టీడీపీలో ఆరు ముక్కలాట

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఓడ దాటాక బోడి మల్లన్న సామెతను వంటబట్టించుకున్న చంద్రబాబు మరోసారి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విషయంలో రిపీట్ చేశాడు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాయిలాలకు ఆశపడి వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి చంద్రబాబు చెంతన చేరిన ఉదయగిరి ఎమ్మెల్యేకు ఫలితం దక్కకపోగా అవమానాలే ఎదురవుతున్నాయి. జిల్లాలోని మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ప్రాధాన్యం ఇచ్చిన బాబు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ చంద్రశేఖర్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వలేదు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉదయగిరి టికెట్‌ను ఆశించి కలిసినా చూద్దాంలే అంటూ మాట దాటవేశారని ప్రచారం జరుగుతోంది.

పిలవని పేరంటానికి వెళ్లి..

ఉదయగిరి ఎమ్మెల్యేగా చంద్రశేఖర్‌రెడ్డి నాలుగు పర్యాయాలు పనిచేశారు. అంతటి రాజకీయ అనుభవం ఉన్న ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాయిలాలకు ఆశపడటం తన రాజకీయ జీవితానికే పెద్ద మాయనిమచ్చగా మిగిలింది. దీనికితోడు పిలవని పేరంటానికి వెళ్లినట్లు టీడీపీ ఆహ్వానం రాకముందే ఆ పార్టీ నేతలతో టచ్‌లోకి వెళ్లారు. దీంతో పాటు యువగళం యాత్ర జిల్లాలోకి రాక ముందే బద్వేలుకు వెళ్లి లోకేశ్‌ను కలిసివచ్చారు. స్థానిక టీడీపీ నేతలు ఆహ్వానించక ముందే వారింటికి వెళ్లి నేను మీతో కలిసి పని చేస్తానని చెప్పడం.. ఈ పరిణామాలు ఎమ్మెల్యే ప్రాధాన్యతను తగ్గించాయని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

చూద్దాంలే..

తాజాగా ఉదయగిరి ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి తన రాజకీయ భవిష్యత్తుపై చర్చించినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తనకు టికెట్ హామీ కూడా ఇచ్చారని, ఈ దఫా తనకు ఇస్తే తప్పక గెలిచి వస్తానని చెప్పుకున్నా చంద్రబాబు సింపుల్‌గా నవ్వేసి చూద్దాంలే అంటూ మాట దాటవేసినట్లు ప్రచారం. బాబు సమాధానంతో కంగు తిన్న ఎమ్మెల్యే తాను పచ్చనేతల మాటలు విని పెద్ద తప్పు చేశానని, వైఎస్సార్‌సీపీకి అన్యాయం చేయకుంటే తనకు ఈ దఫా కూడా న్యాయం జరిగేదని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం.



ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి

ఆ ఇద్దరికే ప్రాధాన్యం..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. అందులో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిలకు టీడీపీ నెల్లూరు రూరల్, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. కానీ ఉదయగిరి ఎమ్మెల్యే విషయంలో ప్లేట్ ఫిరాయించి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపోవడం ఆ పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది.

టీడీపీలో ఆరు ముక్కలాట

ఉదయగిరి టీడీపీలో ఆరు ముక్కలాట సాగుతోంది. పార్టీ ఇన్‌చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. చినబాబు లోకేశ్ ఆశీస్సులతో ఎన్‌ఆర్‌ఐ కాకర్ల సురేష్ టీడీపీ టికెట్ ఆశించి సేవా కార్యక్రమాలతో హడావుడి చేస్తున్నాడు. తాజాగా చంద్రశేఖర్‌రెడ్డి టికెట్ తనదేనంటున్నాడు. వీరికి తోడు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి,, బీసీ కార్డు తెరపైకి తెచ్చి చెంచలబాబుయాదవ్ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు టీడీపీకి ఫండ్ ఇచ్చి తీర్థం పుచ్చుకున్న దగుమాటి వెంకటకృష్ణారెడ్డి టికెట్ తనదేనని తెగ ఆరాట పడుతున్నాడు. మరి ఈ ఆరు ముక్కలాటలో ఎవరూ గెలుస్తారో వేచి చూడాల్సిందే.

• భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. మహిళా భక్తులు సామూహిక లక్ష కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

విద్యా సదస్సును జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో శనివారం విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఓ గంగాభవాని తెలిపారు. శుక్రవారం వారు కస్తూర్బా కళాక్షేత్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యా వ్యవస్థలో వస్తున్న నూతన పరిణామాలను తెలియజేస్తారని చెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై విద్యా సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

పకడ్బందీగా గణేశ్ ఉత్సవ ఏర్పాట్లు

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (పొగతోట): గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల నగరంలో రొట్టెల పండగను అందరి సహకారంతో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గణేశ్ ఉత్సవ కమిటీకి అధికారులు అన్ని విధాలా సహకరించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గణేశ ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. గణేశ ఘాట్‌ల వద్ద విద్యుద్దీపాలంకరణ చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తగా గణేశ్ విగ్రహాలు నిమజ్జనానికి వెళ్లే దారుల్లో విద్యుత్ తీగలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల్లో నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు చెరువు ఘాట్ వద్ద పారిశుధ్యాన్ని మెరుగుపరిచేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీసీ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలన్నారు. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్, సురేంద్రరెడ్డి మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులో గుర్రపుడెక్కను తొలగించి నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. విగ్రహాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ హిమవతి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్

నేడు పంచాయతీరాజ్ ఉద్యోగుల క్రీడా పోటీలు

నెల్లూరు (పొగతోట): పంచాయతీరాజ్ ఇంజినీర్లు, డిప్లమో ఇంజినీర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ బాబూరావు, జనరల్ సెక్రటరీ మున్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పీఆర్ ఎస్ఈ అశోక్‌కుమార్ ఉదయం 8 గంటలకు పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, పరుగు పందెం, తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 15న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుంది.' అని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ బుజబుజ నెల్లూరులో శుక్రవారం సాయంత్రం పార్టీ డివిజన్ అధ్యక్షుడు నవాబ్‌జాన్, మాజీ ఎంపీటీసీ ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో సమతా నగర్, నాగమ్మ కాలనీ, శివాజీ కాలనీ, గిరిజన కాలనీలోని 400 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారిలో మాజీ సర్పంచ్ పొడమేకల సులోచనమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకటమ్మ, తుపాకుల కృష్ణ, శీనయ్య, తుపాకుల నాయుడు తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బుజబుజనెల్లూరు పరిధిలోని పలు ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించడం లేదని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కాగా బుజబుజనెల్లూరులో రూ.30 లక్షల వ్యయంతో డ్రెయిన్ల నిర్మాణానికి ఎంపీ ఆదాల శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, నాయకులు ఏసు నాయుడు, హరిబాబుయాదవ్, లంకా రామశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

సానుభూతి కోసం చంద్రబాబు నాటకాలు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అవినీతి ఆధారాలతో సహా దొరకడంతో ప్రజల సానుభూతి కోసం రకరకాల నాటకాలు ఆడుతున్నాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి బాబు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడన్నారు. చంద్రబాబు బతుకంతా ప్రజలకు తెలుసన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎం కుర్చీ లాక్కున్నాడన్నారు. అధికారంలోకి వచ్చేందుకు అరచేతిలో వైకుంఠం చూపిస్తాడని, సీఎం అయ్యాక ప్రజలను పట్టించుకోడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే చెప్పారు. బాబు చేసిన అవినీతి రూ.లక్షల కోట్లు ఉంటుందని ఆరోపించారు. ఐటీ నోటీసుల గురించి బాబు, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా మాట్లాడడం లేదన్నారు. నిజంగా బాబు ఏ తప్పు చేయకపోయి ఉంటే ఐటీ శాఖ తప్పుడు నోటీసులు ఇచ్చిందని పరువు నష్టం దావా ఎందుకు వేయడం లేదని ఎమ్మెల్యే నిలదీశారు. టీడీపీ అధినేతకు భవిష్యత్ కనిపిస్తోందని, అందుకే ఐటీ నోటీసులకు సమాధానం చెప్పకుండా ఆయన దొంగలా తిరుగుతున్నాడన్నారు. కోడ్ భాషలో డబ్బులు సమకూర్చుకున్నారని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు, కుందుర్తి శ్రీనివాసులు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, దామిశెట్టి సుధీర్ నాయుడు, దామిశెట్టి పూర్ణచంద్రరావు, పందిటి కామరాజు, తిరువీధి ప్రసాద్, పానుగోటి అనురాధ, కనమర్లపూడి వెంకటనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సంగం బిట్–3 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో 93 సచివాలయాలుండగా గడప గడపకు కార్యక్రమాన్ని 78 సచివాలయాల పరిధిలో పూర్తి చేశామన్నారు. సంగం మండలంలోని 13 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ప్రతి అర్జీకి సమాధానం ఇస్తున్నట్లు వివరించారు. మండలంలో గడప గడపకు ముగింపు సమావేశం త్వరలోనే నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వలంటీర్ల పనితీరుపై మహిళలతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. వలంటీర్లు ప్రజలకు మంచి చేస్తున్నట్లు చెప్పారు. వారిపై కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంటే గుర్తింపు కోసం పాకులాడుతున్న ప్రతిపక్ష నాయకులు వారిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మి, మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, నేతలు కర్నాటి రవీంద్రారెడ్డి, శేఖరయ్య, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, గుండాల బాలచంద్రారెడ్డి, మోహన్, వేణు, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, సూరి మదన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విడవలూరు తహసీల్దార్‌గా హమీద్

నెల్లూరు(దర్గామిట్ట): తోటపల్లిగూడూరు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఎం హమీద్‌ను శుక్రవారం విడవలూరుకు బదిలీ చేశారు. విడవలూరులో పనిచేస్తున్న శ్యాంసుందరరాజును కలెక్టర్ ఇటీవల ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఆయన స్థానంలో హమీద్ నియమితులయ్యారు.

ప్రజలకు మెరుగైన సేవలు

- ఏపీఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళి

నెల్లూరు(పొగతోట): నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఏపీఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ మురళి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నెల్లూరులోని కొండాయపాళెంగేట్ సమీపంలో ఉన్న సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని డైరెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. నూతన విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో చెప్పిన అంశాలను క్షేత్రస్థాయిలో పాటించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై ఎస్ఈ అసంతృప్తి

- జిల్లాలో పవర్ హాలిడే లేదని వెల్లడి



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఐఎస్ (వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, లైన్లు, సర్వీసుల జియో ట్యాగింగ్) సర్వే విషయంలో విద్యుత్ అధికారులు పనితీరు మెరుగ్గా లేదంటూ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల్లూరు విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన జిల్లాకు చెందిన ఈఈ, డీఈఈ, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జీఐఎస్ సర్వే విషయంలో 15 రోజుల్లో పనితీరు మెరుగుపరుకోవాలన్నారు. సర్వేను పూర్తి చేయాలని, అలా కాకుండా నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగనన్న కాలనీల్లో నీటి సదుపాయం కోసం ఏర్పాటు చేస్తున్న బోర్‌వెల్స్, గృహ సర్వీసులను తక్షణమే మంజూరు చేయాలని, అందుకు సంబంధించిన విద్యుత్ సామగ్రి స్టోర్స్‌లలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో మంజూరు చేయాలని ఈ ప్రక్రియను కార్పొరేట్ కార్యాలయ అధికారులు రోజూ పర్యవేక్షిస్తున్నారన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా పవర్ హాలిడే లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ సర్వీసులకు ఆధార్, ఫోన్ నంబర్లను లింక్ చేయాలని సూచించారు.

ఘనంగా మెడికల్ కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న వైద్యులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల పదో వార్షికోత్సవాన్ని శుక్రవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. రెండురోజులపాటు జరిగే వేడుకలను ప్రిన్సిపల్ జమున ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ నరేంద్ర, వైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్ కుమార్, నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరంలోని 52వ డివిజన్ రంగనాయకులపేటకు చెందిన జుబేర్, వారి మిత్రబృందం సుమారు 100 మంది నగరంలోని రాజన్న భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమం, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై అనేకమంది వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో బాషీద్, జాకీర్, అహ్మద్, బాబు, నౌషాద్ తదితరులున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ షేక్ కరిముల్లా, నాయకులు మైనుద్దీన్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి గుణపాఠం చెప్పడం ఖాయం



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కావలిముస్తాపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించి తద్వారా లబ్ధి పొందడానికి చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. బాబు బాటలో ఆయన తనయుడు లోకేశ్ నడుస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకోకుండా సొంత పార్టీ కార్యకర్తలను ఇతరులపైకి దాడులకు ఉసిగొల్పుతున్నాడన్నారు. ఎక్కువ కేసులు పెట్టించుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని హింసకు ప్రేరేపిస్తున్నాడన్నారు. జనసేన అధ్యక్షుడు చిల్లర రాజకీయాలు చేస్తూ ప్రజల్లో అభాసుపాలవుతున్నట్లు చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చంద్రబాబుకు లబ్ధి చేకూర్చడానికే ప్రయత్నిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్‌లకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీనివాసులురెడ్డి, ఆదిశేషారెడ్డి, వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 లోగా సవరణలు పరిష్కరించాలి

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటరు జాబితాలో సవరణలకు సంబంధించి ఫారమ్స్ అన్నింటిని ఈనెల 15వ తేదీలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన అంశాలపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో నెల్లూరులోని తిక్కన ప్రాంగణం నుంచి శుక్రవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15వ తేదీలోపు పరిష్కరించకపోతే తగిన చర్యల కోసం ఎన్నికల కమిషన్‌కు సిఫార్సు చేస్తామన్నారు. బీఎల్వోలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి తప్పొప్పులుంటే సరిదిద్దాలన్నారు. పోలింగ్ కేంద్రం వారీగా సమీక్ష చేసుకోవాలని ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలకు సూచించారు. బూత్‌ల వారీగా చేసిన సవరణలు అన్ని కూడా ఈఆర్‌ఓ లాగిన్‌లో కనిపించాలన్నారు. ఫారాల డిస్పోజల్‌లో నెల్లూరు సిటీ నియోజకవర్గం మెరుగైన స్థితిలో ఉందని మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్‌ను అభినందించారు. అలాగే కందుకూరు, సర్వేపల్లి నియోజకవర్గాలు మెరుగ్గా ఉన్నాయని, మిగిలిన చోట్ల వేగవంతం చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ, ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహ పాల్గొన్నారు.

సదస్సు నిర్వహించడం సంతోషకరం

- వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ బాబ్జీ



సదస్సులో మాట్లాడుతున్న వీసీ బాబ్జీ

నెల్లూరు(సెంట్రల్): నారాయణ మెడికల్ కళాశాలలో 41వ ఈఎన్‌టీ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించడం సంతోషకరమని వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జీ అన్నారు. నారాయణ మెడికల్ కళాశాల, సింహపురి ఈఎన్‌టీ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించిన డాక్టర్లను ఒకచోట చేర్చి మెరుగైన సలహాలు, సూచనలివ్వడం చాలా ఉపయోగకరమన్నారు. ఈ సందర్భంగా ఐసీఎంఆర్ సహాయ సహకారాలతో చెవిలో హోరు నియంత్రణకు రూపొందించిన ప్రత్యేక పరికరాన్ని వీసీ ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 10వ తేదీ వరకు సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణ వైద్య విద్య విభాగాల స్పెషల్ ఆఫీసర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రామారావు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	150
లేయర్ (లైవ్):	105
బ్రాయిలర్ చికెన్:	256
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	284
లేయర్ చికెన్:	178

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.65
సన్నవి :	రూ.40
పండ్లు :	రూ.10

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా వంశీధర్‌రెడ్డి



నెల్లూరు(మినీబైపాస్): భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వంశీధర్‌రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం ప్రకటించారు. ముత్తుకూరు మండలానికి చెందిన వంశీధర్‌రెడ్డి నియామకంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

యువకుడి బలవన్మరణం



వెంకటేష్ మృతదేహం

చెన్నూరు: నెల్లూరు జిల్లాకు చెందిన ఇండ్ల వెంకటేష్ (25) అనే యువకుడు శుక్రవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. ఉదయగిరి ప్రాంతానికి చెందిన ఇండ్ల వెంకటేష్‌కు వైఎస్సార్ జిల్లా చెన్నూరు మండలం దౌలతాపురం గ్రామంలోని ఎస్టీ రామాపురానికి చెందిన మల్లీశ్వరితో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. భార్యాభర్తలు దౌలతాపురం ఎస్టీ కాలనీలో ఉంటూ కడపలోని ఓ కల్యాణ మండపంలో స్వీపర్లుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేష్ రెండురోజులుగా ఆరోగ్యం బాగోలేదని చెప్పి గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయి ఎస్టీ కాలనీ సమీపంలోని కంప చెట్లలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.